

# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

## NOVEMBER-2013

సంవత్సర చందా రు. 50/-

# సంక్షిప్త వార్తలు

2013 అక్టోబరు 2వ తేదీ బుధవారం తాడేపల్లిగూడెంలో యున్న క్రీస్తు సంఘము ఆంధ్రరాష్ట్ర క్రీస్తు సంఘ సువార్తికుల సహవాస కూటమును అత్యంత ఘనముగా నిర్వహించిరి. ఆంధ్రరాష్ట్ర మంతటిలో పలుప్రాంతముల నుండియు, తమిళనాడు, కర్నాటక రాష్ట్రములలోను పలుప్రాంతముల నుండియు, క్రీస్తు కొరకు శ్రమించుచున్న సువార్తికులు వచ్చి దానిలో పాల్గొని ఐక్యతలో యున్న రుచిని ఆస్వాదించిరి. ఆకూటములో సహో. జీవన్, యమ్ సామ్యేలురాజు, కె.జి.కుమార్, జాషువా గూటం, కె.బి.బి. చంద్రపాల్, చుక్కా జేకబ్, నెహెమ్యా గూటం గార్లు చక్కటి వాక్యోపదేశము గావించిరి. పలువురు సువార్తికులు ప్రార్ధనలలోను, పాటలలోను సహకరించిరి. స్థానిక సంఘము, వారి సువార్తికుడు సహ దేవుడు గారు, చుక్కా జేకబ్‌గారు విస్తృత ఏర్పాటు ఏర్పాట్లు చేసి కూటమును జయకరముగా సాయంత్రానికి ముగించిరి. హాజరైన వారందరికీ మంచి విందు నేర్పాటు చేసిరి.

2013 అక్టోబరు 9,10 తేదీలలో మెదక్ జిల్లా సిద్దిపేటలో జాషువా గూటం గారు మత శాఖల బోధకులకు ప్రత్యేక బైబిలు తరగతులు నిర్వహించిరి. ఇంచుమించు 74 మంది పాస్టర్లు, 'రెవ రెండ్లు' మొదలగువారు హాజరై సత్యవాక్యము సరిగా విభజించుటను గూర్చి ఆసక్తితో నేర్చుకొనిరి. అక్లాసులలో బోధించుటలో సోదరులు పి.ఐ. సబ్బతిగారు (హైదరాబాదు), యమ్. ఆశీర్వాదం (అల్వాల్, సికింద్రాబాద్) గార్లు జాషువాగారితో కలిసి కృషి చేసిరి. హాజరైన వారందరికీ ఉచిత భోజన సదుపాయములు ఏర్పాటుచేయబడెను. సోదరులు లెమూయేలు ఆచారియా (యాప్రాల్) గారు ఎంతగానో సహాయపడిరి. మరియు ఈ క్లాసులు సంకల్పించుటలోను, నిర్వహహించుటలోను, భోజన సదుపాయములు సక్రమముగా జరిగించుటలోను శతవిధాల కష్టపడిన సోదరులు టి. దేవిడ్ రాజు గారికి,

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH



P.o. Box -80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722

Editor :
**Joshua Gootam**



*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి - 33 | నవంబరు - 2013 | సంచిక - 4


## సత్యమును గ్రహించుకొనుట -1
(Understanding the Truth)

యేసు సిలువ వేయబడక ముందు పిలాతు ఆయనకు తీర్పు తీర్చుచు, "నీవు రాజువా? అని ఆయనను అడుగగా యేసు-నీవన్నట్టు నేను రాజునే; సత్యమును గూర్చి సాక్ష్యమిచ్చుటకు నేను పుట్టితిని; ఇందు నిమిత్తమే . యీలోకమునకు వచ్చితిని; సత్యసంబంధియైన ప్రతివాడును నామాట వినుననెను. అందుకు పిలాతు -సత్యమనగా ఏమిటి ? అని ఆయనతో చెప్పెను" (యోహాను 18:37,38).

మానవుడు జన్మించిన నాటినుండి నత్యమును అన్వేషించుచున్నాడు. సత్యమును అన్వేషించి దానిని కనుగొనుట అతని విధియై యున్నది. అందుకే "సత్యమును అమ్మివేయక దానిని కొని యుంచుకొనుము" అని జ్ఞానియైన సొలొమోను సామెతలు 23:23లో హెచ్చరించుచున్నాడు. మానవానుభవ మును బట్టి అనేకులు సత్యమును అపార్థము చేసుకొనుచున్నారనునది వాస్తవము. అయితే సత్యమును అపార్థము చేసికొనుటవలన గొప్ప ప్రమాదము వాటిల్లునను సంగతికూడ వాస్తవమే. అయితేసత్యమును గ్రహించుకొనుటవలన

గొప్ప ఆశీర్వాదములు లభించునను సంగతిని యెవరు కాదనరు. సత్యమును అందరు గ్రహించుకొనగలరని లేఖనములు బోధించుచున్నవి. నీవు సత్యమును గ్రహించుకొనగోరుచున్నావా ? అట్లయిన సత్యమును గ్రహించుకొనుటకు వీలుగా నీకు కొన్ని సంగతులు చెప్పవలెనని కోరుచున్నాను.

సత్యమనగా యేమిటో మొదట మన మెరుగవలెను. భూమి గుండ్రముగా యున్నదని, సూర్యుని చుట్టు భూమి తిరుగుచున్నదని, భారతదేశమునకు క్రొత్త ఢిల్లీ ముఖ్య పట్టణమని మన మెరుగుదుము. ఇవి సత్యసంగతులు. అయితే వీటిని తెలిసికొనుట ద్వారా ఎవడును మోక్షము చేరలేడు. కేవలము భౌతిక సత్యముల నెరుగుట ద్వారా యెవడును మోక్షములో చేరలేడు. మనము మోక్షమునకు చేరవలెనన్న ఆత్మీయ సత్యముల నెరుగవలెను. దేవుని గూర్చియు, ఆయన తత్వమును గూర్చియు, ఆయన చిత్తమును గూర్చియు ఉన్న సత్యములను మన మెరుగవలెను. మనము దేవుని ఏకైక కుమారుడగు యేసుక్రీస్తును గూర్చియు, ఆయన సంఘమును గూర్చియు ఉన్న సత్యమును తెలిసికొనవలెను. అందుకే, "నేను ఆయన నని మీరు విశ్వసించని యెడల మీరు మీ పాపములోనే యుండి చనిపోవుదురని యేసు చెప్పెను (యోహాను 8:24).

సత్యమనగా యేమిటి? అనే ప్రశ్నను మరొకసారి జ్ఞాపకమునకు తెచ్చుకొందము. దేవుని వాక్యమే సత్యమని యేసు చెప్పుచున్నారు. తండ్రియైన దేవునికి ప్రార్ధన చేయుచు ఆయన ఇట్లనెను: "సత్యమందు వారిని ప్రతిష్ఠ చేయుము; నీ వాక్యమే సత్యము" (యోహాను 17:17). సత్యమనగా యేమిటి? అని యేసును మరల మనము ప్రశ్నించిన యెడల నేనే మార్గమును సత్యమును జీవమును; నాద్వారానే తప్ప యెవడను తండ్రి యొద్దకు రాడు" ఆయన చెప్పుచున్నారు (యోహాను 14:16). అవును యేసే సత్యమై యున్నారు. భక్తుడైన యోహాను ఆయనను ఇట్లు వివరించుచున్నాడు: "ఆదియందు వాక్యముండెను. వాక్యము దేవునియొద్ద ఉండెను, వాక్యము దేవుడై యుండెను, ఆయన ఆదియందు దేవునియొద్ద ఉండెను. సమస్తమును ఆయన మూలముగా కలిగెను, కలిగియున్న దేదియు ఆయన లేకుండ కలుగలేదు. ఆయనలో జీవముండెను; ఆజీవము మనుష్యులకు వెలుగై యుండెను. ఆ వెలుగు చీకటిలో ప్రకాశించుచున్నది గాని చీకటి దానిని గ్రహింపకుండెను". "ఆవాక్యము శరీరధారియై కృపాసత్య సంపూర్ణుడుగా మనమధ్య నివసించెను;

తండ్రివలన కలిగిన అద్వితీయ కుమారుని మహిమవలె మనము ఆయన మహిమను కనుగొంటిమి" (యోహాను 1:1-5, 14).

యేసు ఆదినుండియు వాక్యమైన దేవుడై యుండెను. నేనే సత్యమని చెప్పుటలో యేసు సత్యమునే పలికెను. ఏలయనగా దేవుని వాక్యమే సత్యము. వాక్యమైన దేవుడు శరీరమును ధరించి మనుష్యుల మధ్య యేసుక్రీస్తువలె జీవించెను. గనుక యేసుక్రీస్తే సత్యము. ఆయన వాక్యమే సత్యము. లేఖనములే సత్యమని మనము గ్రహించుకొనవలెను.

అయితే లేఖనములును అనేకులు అపార్ధము చేసికొనుచున్నారు. వారు సత్యమును అపార్ధము చేసికొనుచున్నారు. గనుక దానిలో చాల ప్రమాదమున్నది. "లేఖనములను గాని, దేవుని శక్తినిగాని ఎరుగక మీరు పొరబడుచున్నారు" అని మత్తయి 22:29లో యేసు పలికెను. ఇంకొక మాటలో మనము లేఖనములను అపార్ధము చేసికొనుట వలన పొరబడుట జరుగుచున్నదని చెప్పుకొన వచ్చును. యేసు కాలములో యూదులలో సద్దూకయ్యులు అను తెగవారుండిరి. వారు మృతుల పునరుత్థానము లేదని చెప్పెడివారు. అయితే మృతులైన వారందరును తిరిగి లేతురని లేఖనములు విపులముగా బోధించుచున్నవి. పునరుత్థానమును గూర్చి చెప్పుచున్న లేఖనములను సద్దూకయ్యులు పెడచెవిని పెట్టిరి. అందువలన లేఖనములనుగాని, దేవుని శక్తినిగాని ఎరుగక మీరు పొర బడుచున్నారని యేసు వారికి చెప్పెను. ఈ సద్దూకయ్యులు పునరుత్థానమును గూర్చిన సత్యమును అపార్ధము చేసికొనిరి. పరలోకమందు పెండ్లి చేసి కొనుట, పెండ్లి కియ్యబడుట జరుగునని వారు తలంచిరి. అయితే "పునరుత్థాన మందు ఎవరును పెండ్లి చేసికొనరు. పెండ్లికియ్య బడరు; వారు పరలోక మందున్న దూతల వలె ఉందురు" అని యేసు వారికి బోధించెను (మత్తయి 22:30). లేఖనములను ఎక్కడ అపార్ధము చేసికొనుట జరుగునో అక్కడ విభజనలు ఏర్పడుట సులభము. అందు వలననే పరిసయ్యులు, సద్దూకయ్యులు విభజింపబడి యుండిరి. వారు లేఖనములను ఒకరీతిగ అర్ధము చేసికొననందున అట్టి విభజనలు ఏర్పడెను.

అవును, నేటి క్రైస్తవలోకము కూడ అదే పరిస్థితిలో యున్నది యేసు: "మీరు నావాక్యమందు నిలిచినవారరైతే నిజముగా నాకు శిష్యులై యుండి సత్యమును గ్రహించెదరు; అప్పుడు సత్యము మిమ్మును స్వతంత్రులనుగా చేయునని చెప్పెను" (యోహాను 8: 31, 32). మనము దేవుని వాక్యమందు

నిలిచి యున్న యెడల అసత్యమును గ్రహించుకొనగలము. అసత్యము మనలను పాపమునుండి స్వతంత్రులుగాచేయునని యేసు చెప్పెను. మరల యోహాను సువార్త 17వ అధ్యాయములో యేసు తన అనుచరులందరి ఐక్యత కొరకు ప్రార్థించుచు ఇట్లుపలికెను : "మరియు నీవు నన్ను పంపితివని లోకము నమ్మునట్లు, తండ్రీ, నాయందు నీవును నీయందు నేనును ఉన్నలాగున, వారును మనయందు ఏకమై యుండవలెనని వారికొరకు మాత్రము నేను ప్రార్థించుట లేదు; వారి వాక్యము వలన నాయందు విశ్వాసముంచు వారందరును ఏకమై యుండవలెనని వారికొరకును ప్రార్థించుచున్నాను" (యోహాను 17: 20,21).

అయితే నేడు క్రీస్తు శిష్యులమని చెప్పుకొనువారందరు ఏకమై యున్నారా? యని మన మడిగిన యెడల వారట్లు లేనివారని జవాబియ్యవలసి వచ్చుచున్నది. వారందరు పాపమునుండి విముక్తులమై రక్షింపబడినవారమని చెప్పుకొనుచున్నారే గాని నిజానికి వారు మతశాఖల తత్వమునకు, వేర్వేరు విశ్వాస ప్రమాణ పుస్తకములకు దాసులై యున్నారు. వారు దేవుని వాక్యమునందుగాక మానవకల్పిత సిద్ధాంతములయందు నిలిచి యున్నారు. వారు దేవుని వాక్యమునందే నిలిచి యున్న యెడల తప్పక ఏకమై యుందురు. మనము క్రీస్తు వాక్యమునందు నిలచియుండని యెడల ఆయన శిష్యులమని ఎట్లు చెప్పుకొనగలము? అందుకే "క్రీస్తు బోధయందు నిలచి యుండక దానిని విడిచి ముందునకు సాగు ప్రతివాడును దేవుని అంగీకరిం పనివాడు; అబోధ యందు నిలిచి యుండువాడు తండ్రిని కుమారుని అంగీకరించువాడు" అని 2 యోహాను 9లో వ్రాయబడి యున్నది.

లేఖనములను అపార్థము చేసికొనుటవలన విభజనలు ఏర్పడు చున్నవి అని మనము గ్రహించితిమి, కొరింథులోని సంఘస్థులు లేఖనములను ఒకేరీతిగ అర్థము చేసికొననందున వారిలో విభజనలు వచ్చినట్లు అపొ. పౌలు గమనించెను. వారిలో ఒకడు నేను పౌలువాడను, మరొకడు నేను కేఫా వాడను, ఇంకొకడు నేను అపొల్లో వాడను, మరొకడు నేను క్రీస్తు వాడను అని చెప్పుకొనుచుండిరి. అయితే క్రీస్తుగాని, ఆయన సంఘముగాని అట్లు విభజింపబడి యుండలేదని పౌలు వారికి ఇట్లు బోధించెను: "సహోదరులారా! మీరందరు ఏక భావముతో మాటలాడ వలెననియు, మీలోకక్షలు లేక యేక మనస్సుతోను ఏక తాత్పర్యముతోను మీరు సన్నద్ధులై యుండవలెననియు మన ప్రభువైన

యేసుక్రీస్తు పేరట మిమ్మును వేడుకొను చున్నాను" (1కొరింధి 1:10). అతడు మరల వారిని ఇట్లు ప్రశ్నించెను: "క్రీస్తు విభజింపబడి యున్నాడా ? పౌలు మీకొరకు సిలువ వేయబడెనా? పౌలు నామమున మీరు బాప్తిస్మము పొందితిరా?" (1 కొరింధి 1:13). అట్లు కానే కాదు అని అతని ప్రశ్నలకు మనము జవాబీయ వచ్చును. అట్లు కానప్పుడు క్రైస్తవ లోకములో ఐక్యత ఎందుకులేదు? వారందరు లేఖనములను అపార్థము చేసికొనుట వలనను, కొందరు సత్యమును స్వలాభాపేక్షచే మార్చివేసి బోధించు చున్నందునను వారిలో విభజనలు ఏర్పడినవి.

వచ్చే సంచికలో అనేకులు లేఖనములను ఎందు నిమిత్తము అపార్థము చేసికొనుచున్నారో, అట్టి వారిని సత్యమార్గములో ప్రవేశింపజేయుట ఎట్లో తెలిసికొందము. ఈలోగా నీవు పాపవిముక్తుడవు కాగోరుచున్న యెడల సత్యమూర్తియైన క్రీస్తును విశ్వసించుము. నీ పాపముల విషయమై మారు మనస్సు పొందుము, క్రీస్తు నామమును ఒప్పు కొనుచూ క్రీస్తులోనికి బాప్తిస్మము పొందుము.

## ఇంటి యజమానుని గూర్చిన ఉపమానము
## (The Parable of the Householder)
### మత్తయి 13:51-52

**పరిచయము:**

ఉపమానమనగా పరలోక భావార్థ ములను చెప్పు భూలోక కథయని మనము సూక్ష్మముగా చెప్పుకొనవచ్చును. బైబిలు రకరకాల అలంకార భాషతో యున్న సందర్భములతో నిండియున్నది. అందువలన ఉపమానమేదో అలంకార భాషయేదో యను వాటిపై అందరు ఏకాభిప్రాయమును కలిగి లేరు. కావున యేసు చెప్పిన మొత్తం ఎన్ని ఉపమానము లున్నాయో, ఎన్ని అలంకారరీతిగా చెప్ప బడ్డాయో అను సంఖ్యపై ఏకాభి ప్రాయము లేదు.

అందువలన మత్తయి 13లో కొందరు యేసు చెప్పినవి 7 ఉపమానము లని లెక్కింతురు. మరికొందరు 8 అందురు. అలంకార భాషతో చెప్ప బడిన మొదటి ఏడు సందర్భాలు ఉపమానములని చాలమంది ఉపదేశ కులు లెక్కిస్తారు. వారు ఇంటి యజమా నుని గూర్చి చెప్పిన ఉపమానము ఆసందర్భములో యేసు చెప్పిన ఉపమానములలో అఖరిదిగ మనం చెప్పుకొనవచ్చును (మత్తయి 13:3,53).

"యేసు ఈ ఉపమానములు చెప్పి చాలించిన తరువాత ఆయన అక్కడనుండి వెళ్లి స్వదేశమునకు వచ్చి సమాజ మందిరములలో వారికి బోధించు చుండెను".

**ఉపమానము :**

యేసు మత్తయి 13లో చెప్పిన 7లేక 8 ఉపమానముల భావమును ఆయన శిష్యులు గ్రహించుకొన్నారనియే ఆయన తలంచెను. "వీటినన్నిటిని మీరు గ్రహించితిరా అని వారిని అడుగగా వారు గ్రహించితిమనిరి" (మత్తయి 13:51).

మొదటి ఏడు ఉపమానములలోని ద్వైవిక వర్తమానమును వారు బహుశా గ్రహించేయుందురు. ప్రభువు వర్త మానమును వారు గ్రహించియుండక పోతే దానిని గూర్చి వారాయనను యిదివరలోవలెనే అడిగియుందురు. వారికి తెలియకపోతే "ఆయన శిష్యులు-ఈ ఉపమానభావమేమియని వారాయనను" అడిగేవారు (లూకా 8:9). అయినను సరే యేసుశిష్యులు రాజ్యమును గూర్చి పెద్దగా గ్రహించుకొని యుండ లేదనునది వాస్తవము (యోహాను 6:15; లూకా 24:21). "కాబట్టి వారు కూడి వచ్చినపుడు -ప్రభువా యీకాల మందు ఇశ్రాయేలునకు రాజ్యమును మరల అనుగ్రహించెదవా?" అని ఆయన నడిగిరి (అపో.కా. 1:6).

రాజ్యమును గూర్చి వారెరిగిన దానిని సమర్థించుచు దానిని గూర్చిన వారిజ్ఞానమును ఇతరులకు తెలియ జేయవలెననెడి బాధ్యతను ఆయన వారికి తెలియజేసారు. రాజ్యమును గూర్చిన జ్ఞానము, తరుణములతో బాటు రాజ్యములో బాధ్యతలు కూడ యుండును. మన ప్రభువుకును ఆయన శిష్యులకును మధ్య జరిగిన సంభాషణ మూలముగా ప్రభువు ఈ ఎనిమిదవ ఉపమానమును వారికి చెప్పారు.

"వీటనన్నిటిని మీరుగ్రహించితిరా అని వారిని అడుగగా వారు-గ్రహించితి మనిరి. ఆయన అందు వలన పరలోక రాజ్యములో శిష్యుడుగా చేరిన ప్రతి శాస్త్రియు తన ధన నిధిలోనుండి క్రొత్త పదార్థములను పాత పదార్థములను వెలికి తెచ్చు ఇంటియజమానుని పోలియున్నా డని వారితో చెప్పెను" (మత్తయి 13: 51-52).

ఇంటి యజమానుని గూర్చిన ఈ ఉపమానము ఈ ఎనిమిది ఉపమానము లలోను ముఖ్యాంశము ఒక్కటే. అయినా దాని చిత్రీకరణ వేరు.

యేసు తన అపొస్తలులకు పరలోక రాజ్యములో శాస్త్రులని పేరు పెట్టారు. యూదా మతములో యున్న శాస్త్రులు లేఖనములలోను, వారి

పారంపర్యములలోను శిక్షణ పొందిన వారే అయినను, పరలోక రాజ్యములో అస్థానము కలిగి యుండుటకు సరిపోరు. తన కాలము నాటి శాస్త్రులు, పరిసయ్యులను యేసు బహునిశితముగా ఖండించారు (మత్తయి 23).

దీనికి మారుగా క్రీస్తుయొక్క అపొస్తలులకు రబ్బీల తర్ఫీతు ఏమీ లేదు. గలిలయులు గనుక వారు విద్య, సంస్కృతి మొదలగు వాటియందు ఆరితేరినవారు కారు. అయితే యేసుతో వారు గడిపిన సమయము పరలోక రాజ్యములో తమ బాధ్యతలు నిర్వర్తించుటకు అన్నిటికంటె ప్రశస్తమైన అనుభవాన్ని కల్పించినది (అపొ.కా. 4:13).

తమకాలమందున్న శాస్త్రులకంటె అపొస్తలులు పరలోకరాజ్యమును గూర్చి మరింత విపులముగా బోధింపబడిన వారు. శాస్త్రులవలె అపొస్తలులు కూడ రాజ్యమును గూర్చి అపార్థము చేసికొనినను, అపొస్తలులు మాత్రము పరలోక రాజ్యము యొక్క రాజును నిరాకరించలేదు. అపొస్తలులు పరిశుద్ధాత్మను, తండ్రియైన దేవుని కృపావరమును తిరస్కరించలేదు. బోధింపబడుటకు అపొస్తలులు అసక్తిగలిగినవారు. అయితే ఒక గుంపుగా క్రీస్తు కాలమునాటి శాస్త్రులు మాత్రము ప్రభువుచే బోధింపబడుటకు అయిష్టత గలవారు.

తన్ను వెంబడించువారిని శాస్త్రులని పిలుచుట ద్వారా రాజ్యమును గూర్చిన మర్మమును, వర్తమానమును అజ్ఞానములోయున్న లోకమునకు తెలియజేయాలని యేసు వారిని హెచ్చరించారు. అయన శాస్త్రులవలె యేసు తన ఒక్కొక్క అపొస్తలుని ఒక గృహయజమానిగా పోల్చారు. ఈ గృహ యజమాని తన కప్పగించబడిన యావదాస్థి మీద అధికారము కలిగి యున్నాడు. బహుశ ఆ యావదాస్థి తనదే అయ్యుండవచ్చును. తన అధీనములో యున్న దానంతటిమీద సర్వాధికారము కలిగియుండి అందరికీ గొప్పమేలు కలుగునట్లు దానిని నిర్వహించాడు.

గృహయజమాని అధారపడినది ధననిదియని చెప్పబడినది. ఆధన నిధి పాతది క్రొత్తదియని కూడ చెప్పబడినది. యిది అపొస్తలులకు వర్తింపజేయబడగా యేసుయొక్క శిష్యరికములో వారు సంపాదించిన జ్ఞానము అది. పాతది, కొత్తది యన్నప్పుడు అవి పాత కొత్త నిబంధనకు వర్తించును. ఏభవనమైనా సరే ఎత్తులోను, వెడల్పులోను పాతపునాది మీద ఆధారపడును. క్రొత్తది పాత దానిపై నిలిచి యుండును.

ధర్మశాస్త్రము పాతది, సువార్త క్రొత్తది. అయినను క్రొత్తది పాతదాని మూలమున వచ్చినది. వేరు పురాతనం, ఫలము నూతనం. ఈ లేఖనములో పాత,

క్రొత్త అనుమాటను మనం ఎట్లు అర్ధము చేసికొనాలి? మత్తయి యూదులకు తన సువార్త వ్రాసాడని జ్ఞాపకముంచు కొందాము. ఆలోచనపరుడైన యూదుడు ఎట్లు స్పందిస్తాడు? పాతది, పాతనిబంధన లోని ధనము, క్రొత్తది నజరేయుడైన యేసు యొక్క బోధలు.

**ముగింపు :**

అపొస్తలులకు చెందిన (2 కొరింథీ 4:7) మొదటి బాధ్యత క్రైస్తవులది కూడాను (మార్కు 16: 15-16; 2 తిమో 2:2). మనము యితరులకు యేసుక్రీస్తు సువార్తను బోధించాలి.

– లూయిస్ రాష్ మోర్

## బైబిలును నిజముగా నీవు నమ్మ వచ్చును
## (You can be sure about the Bible )

**పరిచయము:**

"నీవే దేవుని పరిశుద్ధుడవని మేము విశ్వసించి యెరిగి యున్నామని (పేతురు) ఆయనతో చెప్పెను" (యోహాను 6:69).

యేసే దేవుని కుమారుడైన క్రీస్తు అని పేతురు యెరిగి నిజముగా ఎట్లు విశ్వసించాడో, మనముకూడ వివిధ సంగతులను గూర్చి దృఢముగా నమ్మ వచ్చును. గతపాఠంలో మనము దేవుని గూర్చి నిజముగా ఎట్లు నమ్మగలమో తెలిసికొని యున్నాము. ఇప్పుడు బైబిలును గూర్చి తెలిసికొన ప్రయత్నించుదాము.

బైబిలును నిజముగా మనము నమ్మవచ్చునా? తప్పక నమ్మ వచ్చును. దేవుడు తన సృష్టితో సంప్రదించడానికి ఏదో ఒక పద్ధతి విని యోగించుకొనవచ్చును. ఆయన తన వాక్కును వినయోగించారు. యిది శక్తి వంతమైన, ప్రయోజనకరమైన పద్ధతి. మన జీవితాలలో ఆయన చిత్తమును బయలుపరచడానికి దేవుడు తన వాక్యమును ఎంచుకొన్నారు.

**బైబిలు గ్రంధము :**

బైబిలు ఇక్కడ వున్నది. అది ఇక్కడకు ఏలాగు వచ్చినది? అది దానికదే వ్రాసేసుకోలేదు. దానిని 40 మంది లేఖకులు 1600 సంవత్సరములలో వ్రాసిరి. వారిలో చాలమంది ఒకరినొకరు ఎరిగిన వారుకారు. సరిగదా వివిధ కాలములలో వారు జీవించిరి. ప్రతి సంవత్సరము అది అన్నిటి కంటె ఎక్కువగా అమ్ముడగుచున్న గ్రంధము, బైబిలును నాశనము

చేయాలని చేసిన ప్రయత్నములన్నియు విఫలమయ్యాయి.

గత రాత్రి నేనొక కంసాలి వానిని దర్శించితిని. అతని దాగలిపై సమ్మెట శబ్దము వినబడుచుండెను. నేలపై అనేక సమ్మెటలు అరిగిపోయి పడియుండెను. ఇన్ని సమ్మెటలు అరిగిపోడానికి నీవెన్ని దాగళ్లు వినయోగించితివని నేనతని అడిగితిని, ఒకేఒక్కటి! యని చిరునవ్వుతో అతడు జవాబిచ్చెను; "దాగలి సుత్తెలను అరుగగొట్టునుగదా?" శతాబ్దముల తరబడి సంశయశీలురు బైబిలుపై తమ సమ్మెటలను వినియోగిస్తూనే యున్నారు. అవన్నీ వీగిపోయి అరిగిపోయాయి గాని బైబిలు మాత్రము అలాగే నిలిచి యున్నది" యని జాన్ క్లిఫర్డ్ అను నతడు వ్రాసాడు. బైబిలునిజముగా ఆశ్చర్యకరమైన గ్రంథము. జీవితమును గూర్చిన అతిప్రాముఖ్యమైన ప్రశ్నల కది జవాబిచ్చును: నేనెవరిని ? ఎక్కడినుండి వచ్చాను? ఇక్కడ ఎందుకు వున్నాను? ఎక్కడికి వెళ్లుచున్నాను ? అది మాత్రమే మనకు సరియైన జవాబులనీయగలదు. మన జీవితాలకు నిరీక్షణ ఇయ్యగలదు.

దైవ ప్రేరితము :

బైబిలు దైవావేశము వలన కలిగిన దానిని చెప్పుకొనుచున్నది. "దైవజనుడు సన్నద్ధుడై ప్రతిసత్కార్యమునకు సిద్ధపడి యుండునట్లు దైవావేశము వలన కలిగిన ప్రతిలేఖనము ఉపదేశించుటకును, ఖండించుటకును తప్పుదిద్దుటకును నీతియందు శిక్ష చేయుటకును ప్రయోజనకరమై యున్నది" (2 తిమోతి 3:16-17). లేఖకులు తాము వ్రాసిన దానికి తామే కర్తమలని చెప్పుకొనలేదు, సరిగదా అది దేవుని వాక్యమని వారు చెప్పుచుండిరి. "ఒకడు తన ఊహను బట్టి చెప్పుట వలన లేఖనములలో ఏ ప్రవచనమును పుట్టదని మొదట గ్రహించుకొనవలెను. ఏలయనగా ప్రవచనము ఎప్పుడును మనుష్యుని ఇచ్ఛను బట్టి కలుగలేదు గాని మనుష్యులు పరిశుద్ధాత్మ వలన ప్రేరేపింపబడినవారై దేవుని మూలముగ పలికిరి" యని పేతురు వ్రాసెను (2 పేతురు 1:20-21).

బైబిలు దైవప్రేరితమేగాక అది పద ప్రేరితమైనది (Verbally Inspired). అంటే లేఖకులు ఏ పదములను వాడవలెనో దేవుడు వారికి తెలియజేసెనన్నమాట, అందు వలన లేఖకుడు కాని మాటను వాడకుండా దేవుడు జాగ్రత్తచేసెను. దావీదు ఇట్లు వ్రాసాడు: "యెహోవా ఆత్మ నాద్వారా పలుకుచున్నాడు. ఆయన వాక్కు నా నోట ఉన్నది" (2 సమూ 23:2). దేవుని

వాక్యము దావీదు నోట యుండెనను సంగతి గమనించుము. యిర్మియా ఇట్లు వ్రాసాడు: "యెహోవా చేయిచాపి నానోరుముట్టి యీలాగు సెలవిచ్చెను. ఇదిగో నేనునీనోట నామాటలు ఉంచియున్నాను" (యిర్మీ 1:9). యిర్మియా నోట దేవుని వాక్కు వుండెను. తత్ఫలితముగా బైబిలు దేవుని వాక్యమై యున్నది.

**సంపూర్ణమైనది కడవరిది :**

పూర్వకాలమందు దేవుడు పలువిధములుగా మానవులతో సంప్రదింపులు జరిపెను. ఆయన స్వప్నముల ద్వారాను. దర్శనములు ద్వారాను, దూతల ద్వారాను తన చిత్తమును తెలియజేసెను. "పూర్వకాలమందు నానా సమయముల లోను నానా విధములుగాను ప్రవక్తల ద్వారా మన పితరులతో మాటలాడిన దేవుడు ఈ దినముల అంతమందు కుమారుని ద్వారా మనతో మాటలాడెను. ఆయన ఆ కుమారుని సమస్తమునకు వారసునిగా నియమించెను." అని హెబ్రీపత్రిక లేఖకుడు చెప్పాడు (హెబ్రీ 1:1-2). గతంలో దేవుడు పలు విధములుగా మాటలాడినా, ఈ క్రైస్తవ యుగములో తన కుమారుడైన యేసు క్రీస్తు ద్వారానే మాటలాడు చున్నారు.

యేసుయొక్క అపొస్తలులు సర్వ సత్యములోనికి నడిపింపబడునట్లు దేవుడు పరిశుద్ధాత్మను వారిపైకి పంపెను. యేసు వారికి ఇట్లు చెప్పెను: "అయితే ఆయన, అనగా సత్యస్వరూపి యైన ఆత్మ వచ్చినప్పుడు మిమ్మును సర్వసత్యములోనికి నడిపించును. ఆయన తనంతట తానే యేమియు బోధింపక వేటిని వినునో వాటిని బోధించి సంభవింపబోవు సంగతుల ను మీకు తెలియజేయును" (యోహాను 16:13). యేసు తాను చేసిన వాగ్దానమును నెరవేర్చెను. పరిశుద్ధాత్ముడు అపొస్తలులను సర్వసత్యములోనికి నడిపించెను.

భక్తుడైన యూదా ఇట్లు వ్రాసాడు: "ప్రియులారా మనందరికి కలిగెడు రక్షణను గూర్చి మీకు వ్రాయ వలెనని విశేషాసక్తి గలవాడనై ప్రయత్నపడుచుండగా పరిశుద్ధులకు ఒక్కసారే అప్పగింపబడిన బోధ నిమిత్తము మీరు పోరాడవలెనని మిమ్మును వేడుకొనుచుఅన్నను (యూదా 1:13). (విశ్వాసము), సువార్త నియమము పరిశుద్ధులకు ఒక్కమారే అప్పగింపబడెను.

మొదటి శతాబ్దములో ఆత్మ

వేశము గలవారు సర్వసత్యము లోనికి నడిపింపబడినందున, నేడు క్రొత్తగా ఇయ్యబడే బయల్పాటు యేమిలేదు కొందరు దేవుడు తమతో యేదేదో చెప్పారని నేడు కూడ చెప్పుకొందురు. అది అసాధారణం యేమికాదు. వారు అబద్ధ బోధకులు; యేసు చెప్పిన దానికి వారు చెప్పుకొనేది కేవలం వ్యతిరేకము. నేడు దేవుని సంపూర్ణబయల్పాటుగా బైబిలు గ్రంధమును కలిగియున్నాము.

**ప్రేరణ యొక్క రుజువులు :**

రుజువు లేనిదే దేనిని మనం అంగీకరించ రాదని దేవుడు కోరుచున్నారు. "సమస్తమును పరీక్షించి మేలైన దానిని చేపట్టుడి" యని ఆయన మనలను హెచ్చరించారు (1థెస్స 5:21). నిష్పాపట్య పరిశోధనకు బైబిలు వ్యతిరేకము కాదు. బైబిలు యొక్క దైవ ప్రేరణను గూర్చి దేవుడు మనకు రుజువుల నిచ్చియున్నారు. అందులో కొన్ని రుజువుల గమనించుదము.

**విజ్ఞాన శాస్త్ర రుజువులు :**

సైన్సుకును బైబిలుకును మధ్య విభేదములు యేమిలేవు. రుజువును గాని భావార్ధమును గమనించాలి. సైన్సుయొక్క భావార్ధము సరిగా లేకపోతే, బైబిలు దానికి విరుద్ధముగా యున్నట్లగుపడును. నిజానికి అది తప్పుడు భావార్ధము వలన కలిగినది. అట్లే బైబిలుకు సరియైన భావార్ధము లేకపోతే అది విజ్ఞాన శాస్త్రముకు విరోధముగా యున్నట్లుగుపడును. దేవుడే నిజ సైన్సుకు బైబిలుకు కర్త. నిరూపింపబడిన విజ్ఞాన శాస్త్రముకు బైబిలుకు వైరుధ్యము యేమీ లేదు.

క్రీ॥పూ 750 సం॥లో జీవించిన యెషయా, ఇట్లు వ్రాసాడు: "ఆయన భూమండలము (Circle) మీద ఆసీనుడై యున్నాడు. దాని నివాసులు మిడతల వలె కనబడుచున్నారు. ఒకడు తెరను విప్పినట్లు ఆయన అకాశ వైశాల్యమును వ్యాపింపజేసెను. ఒకడు గుడారము వేసినట్లు ఆయన దానిని నివానస్థలము గా ఏర్పరచెను" (యెషయా 40:22). భూమి గుండ్రము గా యున్నట్లు ఈ వచనము చెప్పు చున్నది. గాని ప్రజలు చాలకాలము వరకు భూమి బల్ల పరుపుగా యున్న దని తలంచుటచే యెషయా చెప్పినది వారి భావార్ధమునకు వ్యతిరేక మాయెను. భూమి గుండ్రముగా యున్నదని యెషయాకు ఎట్లు తెలియును ? యెషయాకంటే అనేక

సంవత్సరముల పూర్వము, గొర్రెల కాపరియైన దావీదు. "అడవి మృగములను ఆకాశ పక్షులను సముద్ర మత్స్యములను సముద్ర మార్గములలో సంచరించు వాటినన్నిటిని వాని పాదముల క్రింద ఉంచి యున్నావు" అని వ్రాసాడు (కీర్తన 8:8). సముద్రములో మార్గములు న్నాయని దావీదుకెట్లు తెలియును? కీర్తనల గ్రంథము చదువుట ద్వారా సముద్రములో యున్న మార్గములు కనుగొనబడినవి. ఆమార్గము ద్వారానే నేడు పెద్ద పెద్ద ఓడలు రవాణా యగు చున్నవి. ఇట్టి అనేక విజ్ఞాన శాస్త్రవాస్తవములు బైబిలునందు చెప్పబడి యున్నవి. అధునిక విజ్ఞాన శాస్త్రము ప్రబలకముందే ఈ గొప్పవాస్తవములను బైబిలు లేఖకులు అనాడే ఎట్లు చెప్ప గలిగిరి? విజ్ఞానశాస్త్రవేత్తయైన దేవుడే బైబిలు యొక్క కర్తకూడాను.

**బైబిలుయొక్క ఐక్యత :**

బైబిలులో మనకు కనబడు గొప్ప ఐక్యతయే అదిదైవ ప్రేరిత గ్రంథమని రుజువు చేయుచున్నది. ఇంతకు ముందు చెప్పుకొన్నట్లు బైబిలు నందు 66 పుస్తకము లుగలవు. వాటిని 40 మంది లేఖకులు 1600 సంవత్సరముల కాలములో ఒకరినొకరు ఎరుగకుండగయే వ్రాసిరి. అయినను బైబిలు నిజంగా ఒకే ఒక్క గ్రంథమై యున్నది. బైబిలు యొక్క అంశమంతటిలోను అశ్చర్యకరమైన ఐక్యత యున్నది. క్రీస్తు రాకను గూర్చి, సంఘ స్థాపనను గూర్చి బైబిలులో ముందుగనే చెప్పబడెను. నిజానికి బైబిలు గ్రంథకర్త దేవుడేగనుక దాని ఏకత్వము ఆయనకు గొప్ప రుజువుగా యున్నది.

**ప్రవచనములు, వాటినెరవేర్పు :**

క్రీస్తును గూర్చి వందలాది ప్రవచనములు బైబిలునందున్నవి. అవన్నీ అక్షరాల నెరవేరినవి. ఆయన జననము, జన్మస్థలము, ఆయన జీవితము, ఆయన పరిచర్య, ఆయన అప్పగింపబడిన విధానము, ఆయన మరణము, సమాధి, పునరుత్థానము మొ॥నవి వందలాది సంవత్సరములకు ముందే ప్రవచింపబడెను. సంఘము కూడ ప్రవచింపబడిన సంస్థయే. అది ఎప్పుడు ఎక్కడ ఎట్లు స్థాపించబడునో ప్రవచింపబడిన రీతి గానే స్థాపించబడెను. అక్షరాల ఆప్రవచనములు నెరవేరెను. ప్రవచనములు వాటి నెరవేర్పుకు ఇవి కేవలము మచ్చుగా మాత్రమే చూపబడినవి. ఇవన్నీ అక్షరాల నెరవేరెనని జ్ఞాపక ముంచుకొనుము.

ఇట్టి రుజువులను ఖగోళ శాస్త్రము, భూగర్భశాస్త్రము. భౌగోళ శాస్త్రము మొ॥గు వాటి నుండి అనేకములు మనము చూపవచ్చును. గాని బైబిలును నీవు నిజముగా నమ్మవచ్చుననుటకు యివి చాలును.

**ఏనిబంధన ?**

బైబిలులో 66 పుస్తకములున్నను దానిలో రెండు ముఖ్య నిబంధనలున్నవి; పాతనిబంధన. క్రొత్త నిబంధన, ఒకడు తన జీవితంలో దేవుని చిత్తాన్ని తెలిసి కోవాలంటే అతడు ఈ రెండు నిబంధనల వ్యత్యాసాన్ని తెలిసికోవాలి. పౌలు తిమోతిని ఇట్లు హెచ్చరించాడు: "దేవుని యెదుట యోగ్యునిగాను సిగ్గుపడనక్కర లేని పనివానిగాను సత్య వాక్యమును సరిగా ఉపదేశించువానిగాను నిన్ను నీవే దేవునికి కనుపరచుకొనుటకు జాగ్రత్త పడుము" (2తిమోతి 2:15). దేవుని వాక్యమును మనము సరిగ విభజించాలి. ఇది ప్రాముఖ్యము ఈరెండు నిబంధనల వ్యత్యాసమును బైబిలు చెప్పుచున్నది. సీనాయి కొండమీద మోషే ద్వారా ఇయ్యబడిన పాతనిబంధన ఐగుప్తులో నుండి వెలుపలికి వచ్చిన యూదులకు ఇయ్యబడెను. "మోషే ఇశ్రాయేలీయులను పిలిపించి ఇట్లనెను: ఇశ్రాయేలీయులారా నేను మీ వినికిడిలో నేడు చెప్పుచున్న విధులను విని వాటిని నేర్చుకొని వాటి ననుసరించి నడువుడి. మన దేవుడైన యెహోవా హోరేబులో మనతో నిబంధన చేసెను. యెహోవా మన పితరులతో కాదు, నేడు ఇక్కడ నజీవులమై యున్నమనతోనే యీనిబంధన చేసెను" (ద్వితీ 5:1-3). యూదులను క్రీస్తు నొద్దకు నడిపించుటకు ఈ నిబంధన ప్రయోజనకారియాయెను. పౌలు ఇట్లు వ్రాసెను "కాబట్టి మనము విశ్వాస మూలమున నీతిమంతులమని తీర్పు బడునట్లు క్రీస్తునొద్దకు మనలను నడిపించుటకు ధర్మశాస్త్రము మనకు బాల శిక్షకుడాయెను. అయితే విశ్వాసము వెల్లడియాయెను గనుక ఇక బాలశిక్షకుని క్రింద ఉండము" (గలతీ 3:24-25).

ధర్మశాస్త్రము అనగా పాత నిబంధన యూదులను క్రీస్తు నొద్దకు నడిపించుటకు ఒక బడిపంతులుగా పనిచేసెను. గాని విశ్వాసము (క్రీస్తు, సువార్త) వెల్లడియాయెను గనుక వారిక మీదట అబడి పంతులు క్రింద ఉండరు. అనగా పాతనిబంధన క్రింద ఇక వుండరు.

పాతనిబంధన ప్రకారము యూదులు సంవత్సరమునకు మూడు

సార్లు యెరూషలేము వెళ్లి పాతనిబంధన పండుగలనాచరించాలి. అయితే నేడు మనందరము క్రొత్తనిబంధన క్రింద యున్నాము. హెబ్రీ లేఖకుడిట్లును చున్నాడు: "ఆయన నీ చిత్తము నెరవేర్చు టకు ఇదిగో నేను వచ్చియున్నానని చెప్పుచున్నాడు. ఇవన్నియు ధర్మశాస్త్రము చొప్పున అర్పింపబడుచున్నవి. ఆరెండవ దానిని స్థిరపరచుటకు మొదటి దానిని కొట్టివేయుచున్నాడు. యేసుక్రీస్తు శరీరము ఒక్కసారియే అర్పింపబడుట చేత ఆచిత్తమును బట్టి మనము పరిశుద్ధపరచబడి యున్నాము" (హెబ్రీ 10: 9-10). క్రీస్తు మొదట (పాత) నిబంధనను తీసివేసారు. రెండవ దానిని (క్రొత్తనిబంధనను) స్థిరపరచారు.

క్రీస్తు పాతనిబంధనను కొట్టి వేసినట్లు కొలస్సయులకు వ్రాయబడిన పత్రిక చెప్పుచున్నది: "దేవుడు వ్రాత రూపకమైన ఆజ్ఞల వలన మన మీద ఋణముగాను మనకు విరోధముగాను నుండిన పత్రమును మేకులతో సిలువకు కొట్టి దానిమీది చే వ్రాతను తుడిచి వేసి మనకు అడ్డములేకుండ దానిని ఎత్తివేసి మన అపరాధము లన్నిటిని క్షమించి, ఆయనతోకూడ జీవింప చేసెను" (కొలస్స 2:14). రోమీయులకు వ్రాస్తు పౌలు ఇట్లుచెప్పాడు: "కావున నాసహోదరులారా, మనము దేవుని కొరకు ఫలమును ఫలించునట్లు మృతులలోనుండి లేపబడిన క్రీస్తు అను వేరొకని చేరుటకై మీరును ఆయన శరీరము ద్వారా ధర్మశాస్త్రము విషయమై మృతులైతిరి" (రోమా 7:4).

**క్రొత్తనిబంధనను గ్రహించాలి :**

దేవుని వాక్యమును అర్థము చేసికొనగోరువారు క్రొత్తనిబంధనను గ్రహించుకోవాలి. దానిలో మత్తయి, మార్కు, లూకా, యోహాను సువార్తలు యేసుక్రీస్తు జీవిత చరిత్ర యై యున్నవి. అపొస్తలులకార్యముల గ్రంధము క్రొత్త నిబంధన సంఘచరిత్రయై యున్నది. అది సంఘస్థాపనను గూర్చి, ప్రపంచమంతటా జరిగిన దాని వ్యాప్తిని గూర్చి తెలియ జేయుచున్నది. రోమీయులకు వ్రాయ బడిన పత్రికనుండి యూదా వ్రాసిన పత్రిక వరకు యున్నవి ఆయా సంఘములకు, వ్యక్తులకు వ్రాయబడెను. క్రైస్తవ జీవ నమును గూర్చి అందు హెచ్చరికలున్నవి. ఘోరమైన హింసనెదుర్కొనుచున్న క్రైస్తవులకు ప్రకటన గ్రంధము వ్రాయ బడెను. మనము క్రీస్తునందు నమ్మకముగా యుంటే విజయం మనదే యని ఆ గ్రంధము నిర్ధారణ యిచ్చుచున్నది.

– బిల్లీ బ్లేండ్

## నీతి యావత్తు జరిగించుటకు
## (To fulfill all Righteousness)

లేఖనములు దైవావేశ పూరితమైనవి (యోహాను 20:21-23; 2 తిమోతి 3:10). ప్రాముఖ్యము కాని లేఖనభాగములు యేమీ బైబిలునందు లేవు. గాని కొన్ని లేఖనములు మన దృష్టిని ఆకర్షించునట్లుండును. మత్తయి 3:15 అట్టిది: యోహాను దగ్గరకు బాప్తిస్మము పొందుటకు యేసు రాగా అతడాయనను నివారింపజూచెనుగాని "యేసు -ఇప్పటికి కానిమ్ము ; నీతి యావత్తు ఈలాగు నెరవేర్చుట మనకుతగి యున్నదని అతనికి ఉత్తర మిచ్చెను".

మన దేవుడు ఎన్నడు మార్పు జెందని వాడు. అందు వలన కాలమును బట్టి ఆయన మార్పుజెందడు. ఒకటి మాత్రము దీనిని గుర్తించగలము. ఆయన ఏర్పాటు చేసిన రక్షణ సంకల్ప విషయంలో నీరు ఎల్లవేళలా ఇమిడి యున్నది ! మన పితరుడైన నోవహు, అతని కుటుంబము నీటి మూలముగా రక్షింపబడిరి (ఆది.కా. 7,8 అధ్యా; 1పేతురు 3:18-22). ఇశ్రాయేలీయులను మోషే నీటి ద్వారా ఐగుప్తు బానిసత్వము. నుండి రక్షించెను (నిర్గమ 14; 1 కొరింథీ 10:1-4). చివరిగా ఇప్పుడు రక్షింపబడగోరువారందరు నీటి బాప్తిస్మము పొంద వలసి యున్నది (అపొ.కా. 2:37-39; రోమా 6:1-7, కొలస్స 2:11-12 ; 1 పేతురు 3:21-22). దేవుడు తన కుమారుడైన యేసు క్రీస్తును యోహాను ద్వారా యొర్దాను నదిలో ముంచుట వలన నీటి బాప్తిస్మము యొక్క నిలకడ తత్వాన్ని బయలుపరిచారు. యేసు నీతియావత్తు జరిగించుటకు బాప్తిస్మము పొందారు!

మత్తయి 3:15 మనకు మూడు ప్రాముఖ్య సంగతులను ఘోషించు చున్నది. ఆదికాండమునుండి మలాకీ వరకు ప్రకటింపబడుచున్న దేవుని చిత్తాన్ని ఈఏకైక క్రియ మనకు సంపూర్ణముగా చూపించుచున్నది. రాబోవురాజ్యములో యుండగోరు వారందరు చేయవలసిన మాదిరిని అది స్థిరపరచుచున్నది. కుమారుడైన యేసు త్రియేక దేవుని చిత్తానికి సంపూర్తిగా విధేయత చూపుటలో దేవుని యొక్క ఆమోదమును పొందెనను సంగతిని మనకు అది తెలియజేయు చున్నది.

"నీతియావత్తు జరిగించుట కొరకు" అను మాటలు ఏకైమైనవి. అవి ఆశ్చర్యమైనవి. లేఖనాల్లో ఈ మాటలు మరొక చోట ఎక్కడ కన్పించవు. రాబోవు రాజ్యప్రవేశమునకు

పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము అవసరమని అది తెలియజేయుచున్నది. పాపక్షమాపణ కొరకు అను మాటలు 23 సార్లు బైబిలునందు మన కగుపడును. "నీతియావత్తు జరిగించుటకు" అనగా To fulfill, గ్రీకులో Pleeroo అని యున్నది. అంటే నింపుటకు, సంపూర్ణము చేయుటకు, పూర్తిగా యిచ్చుటకు, సంపూర్తిగా నింపుటకు అని యర్థము.

"నీతి యావత్తు నెరవేర్చుటకు ఈలాగు కానిమ్మని" యేసు చెప్పుటలో పాతనిబంధన అంతయు సంగ్రహించబడి, ఈ ఒక్క క్రియలోనే, అనగా ఆయన పొందిన బాప్తిస్మములోనే యున్నదని యేసు యొక్క ఉద్దేశ్యమై యుండెను. ఇక్కడ ఆయన తన బహిరంగ పరిచర్య ప్రారంభించారు, నీటి బాప్తిస్మము యొక్క ఆవశ్యకతను ఇక్కడ ఆయన ఉద్ఘాటించారు, మానవాతారుడైన ఆయనకు ఇక్కడ తండ్రి యొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు ఆశీస్సులులభించెను. ఈసంఘటన యొక్క ప్రాముఖ్యతను తక్కువగా అంచనావేయకూడదు.

యేసు ప్రభువు యొక్క గమ్యము, కృషి అంతయు లేఖనములను నెరవేర్చుటయే (మత్తయి 5:7). ఆయన ధర్మశాస్త్రమును, ప్రవక్తల వచనములను, అనగా పాత నిబంధన నంతటిని నెరవేర్చుటకు వచ్చెను. పాతనిబంధనలో బయలుపరచబడిన చిత్తమును క్రియా రూపముగా ఆయన సంపూర్ణముగా నెరవేర్చుటకు వచ్చెను ఆయన యందు దేవుని వాక్యము సర్వసంపూర్ణముగా నెరవేరునట్లు ఆయన ఏతెంచెను. ఆయన దేవుని వాగ్దానమునకు నెరవేర్పుగా ఆయన విధేయత చూపించెను (మత్తయి 3:15). దేవుని వలన యేది నియమింపబడెనో, దానిని ఆయన అంగీకరించిదానికి సంపూర్తిగా లోబడెను.

మానవుడు బాప్తిస్మమును అంగీకరించి దానికి లోబడాలి. ఏలయనగా పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందవలెననునది దేవుని చిత్తము అది దేవుని ఆజ్ఞ, దేవుని మాదిరియై యున్నది. యేసు యోహాను దగ్గర బాప్తిస్మము పొందుటలో ఆయన మనకు మాదిరిగా యున్నారు (మత్త 3:10). దానిని క్రీస్తు అందరికీ ఆజ్ఞాపించెను (మార్కు 16:15-16). దానిని క్రీస్తు అపొస్తలులకు ఆజ్ఞాపించెను (మత్తయి 28:18-20). మరియు దానిని అపోస్తలులు కూడ ఆజ్ఞాపించిరి (అపో.కా. 2:38-41).

యొర్దానునదిలో యేసు యోహానుచే బాప్తిస్మము పొందిన మంచి మాదిరి వలన దేవునికి స్తోత్రము.

– రస్ మెకల్లో

# రక్షణ, దేవుని ఉచిత వరము
# (Salvation, God's Free Gift)

రక్షణను గూర్చిన సత్యమును తెలిసికొనుట ప్రాముఖ్యము. ఈ విషయంలో అసత్యము నంగీకరించిన యెడల అపవాదితోను వానిదూతలతోను మనం నిత్య నరకమనుభవింపవలసి వచ్చును. గనుక యిది జీవన్మరణముల సమస్య

యేసుక్రీస్తు యొక్కపునరుత్థానము తరువాత మొదటి పెంతెకొస్తుపండుగ నాడు యూదులు యెరూషలేములో సమకూడి యుండిరి. అయితే వారు చిరకాలమునుండి ఎదురుచూచుచున్న మెస్సీయనే వారు చంపించిరనే సత్యాన్ని వారు ఎదుర్కొనవలసి వచ్చినది. ఈవాస్తవము వలన వారు కలవరపడిరి. "సహోదరులారా, మేమేమి చేతుమనే" సరియైన ప్రశ్నను వారడిగిరి (అపొ.కా. 2:37).

సరియైన జవాబుకొరకు సరియైన ప్రశ్నలనడగాలి, ఈ యూదులు యేసుక్రీస్తు దేవుని కుమారుడనే సత్యాన్ని అంగీకరించిన తరువాత సరియైన ప్రశ్ననడిగారు. పరిశుద్ధాత్మ ప్రేరణవలన పేతురు, "మీరు మారుమనస్సుపొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి, అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు" అని వారికి చెప్పాడు (అపొ.కా. 2:38). మరల "మీరు మూర్ఖులగు ఈతరము వారికి వేరై రక్షణ పొందుడని వారిని" అతడు హెచ్చరించెను (40వ). ఆదిన మందు ఇంచుమించు మూడు వేలమంది బాప్తిస్మము పొందిరి.

ఒకడు నశించిన స్థితిలో యున్నాడనే సంగతి గ్రహిస్తేనే గాని ఎవడును రక్షింపబడగోరడు. మనం యేమిచేసినా, చేయకపోయినా దేవుడు మనలను రక్షిస్తాడని అపవాది అనేకులను మోసగించుచున్నాడు. యిది దురదృష్టకరము. ఒక్కక్షణం ఆగి దీనిని ఆలోచించు, యిది అవునా ? కాదా ?

పాపము వలన మానవుడు దేవుని నుండి వేరు చేయబడి యున్నాడు. దానిని పౌలు ఇట్లు విశదీకరించుచున్నాడు : "అట్టివారు సమస్తమైన దుర్నీతి చేతను, లోభముచేతను, ఈర్ష్యచేతను నిండుకొని మత్సరము, నరహత్య, కలహము, కపటము, వైరమను వాటితోనిండిన వారై కొండెగాండ్రును, అపవాదకులును దేవద్వేషులును, హింసకులును, అహంకారు

లును బింకములాడువారును చెడ్డవాటిని కల్పించు వారును, తలిదండ్రుల కవిధేయులును అవివేకులును మాట తప్పు వారును అనురాగ రహితులును నిర్ధయులునైరి. ఇట్టి కార్యములను అభ్య సించువారు మరణమునకు తగినవారు అను దేవుని న్యాయవిధిని వారు బాగుగ ఎరిగి యుండియు వాటిని చేయుచున్నారు."(రోమా 1:29-32). ఈలిస్టులో మనందరం ఎక్కడో ఒక చోట ఉండియుంటాము. అయితే అట్టి క్రియలు చేయువారందరు మరణము నకు పాత్రులు. దేవుని మహోచిత కృప వలన మన పరలోకపు తండ్రి తన కుమారుని ద్వారా మనందరికీ రక్షణననుగ్రహించుచున్నారు. మనలను రక్షించు నిమిత్తము యేసు పరలోకమందలి తన గృహమును వీడి మన కొరకు వచ్చారు.

యేసు పాపులను రక్షించుటకు ఈ లోకమునకు వచ్చెననునది గొప్పసత్యము (1 యోహాను 1:15).

"ఆయన మనుష్యులందరు రక్షణ పొంది సత్యమును గూర్చిన అనుభవజ్ఞానము గలవారై యుండవలెనని యిచ్ఛయించుచున్నారు" (1 తిమోతి 2:41).

మన నిత్య రక్షణ కడవరి కాలమందు బయలుపరచబడును (1 పేతురు 1:5).

"మరి ఎవని వలనను రక్షణ కలుగదు; ఈ నామముననే మనము రక్షణ పొందవలెను గాని ఆకాశము క్రింద మనుష్యులలో ఇయ్యబడిన మరి ఏనామమున రక్షణ పొందలేము" (అపో.కా. 4:12).

ఈరోజే రక్షణ దినము. "అనుకూలసమయమందు నీ మొర నాలకించితిని, రక్షణ దినమందు నిన్ను ఆదుకొంటిని అని ఆయన చెప్పుచున్నాడుగదా, ఇదిగో ఇప్పుడే మిక్కిలి అనుకూలమైన సమయము, ఇదిగో ఇదే రక్షణ దినము'' (2 కొరింథీ 6:2).

రక్షణ ఉచితము : "మీరు విశ్వాసము ద్వారా కృపచేతనే రక్షింపబడియున్నారు; ఇది మీవలన కలిగినది కాదు, దేవుని వరమే, (ఎఫెసీ 2:8). అయితే ఈ ప్రశస్త వరమును గూర్చి దేవుడు ఎవరిని బలవంతముచేయడు. విధేయత చూపుట ద్వారా ఈ రక్షణ వరమును మనం స్వీకరించాలి.

"నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును. నమ్మనివానికి శిక్షవిధింపబడును" అని యేసు చెప్పెను (మార్కు 16:16).

– గోర్డన్‌హోగన్

# దేవుని యొక్క కాపుదల
# (The Providence of God )

దేవుని యొక్క కాపుదల అనేమాట బైబిలునందు అగుపడదు గాని బైబిలు నిండా దేవుని కాపుదల కనబడుచునే యుంటాది. కాపుదల అనేమాట గ్రీకు భాషలో భవిష్యత్ తలంపు అనేభావము కలిగియున్నది.

దేవుని యొక్క కాపుదల అనగా దేవుడు తన సృష్టిని పరిరక్షించుటకు, సంరక్షించుటకు, పాలించుటకున్నతత్వమని నిర్వచింప వచ్చును. ఇంకోమాటలో దేవుడు తన చిత్తమును జరిగించుటకు తెర వెనుక జరిగించు క్రియయని చెప్పుకోవచ్చును.

రెండు రకములైన కాపుదల కలదు, సాధారణం, ప్రత్యేకం. మొదటిగా సాధారణ రీతిలో దేవుడు తన సృష్టిని చలింపజేస్తు దానిని పోషించును. "ఆయన చెడ్డవారి మీదను అనీతిమంతుల మీదను వర్షము కురిపించుచున్నాడు" (మత్తయి 5:45). ఆయన "తన మహాత్తుగల మాటచేత సమస్తమును నిర్వహించుచున్నారని" హెబ్రీ పత్రిక లేఖకుడు తెలియజేయుచున్నాడు (హెబ్రీ 1:3).

దేవుడు తన ప్రజలయెడల ప్రత్యేకమైన కాపుదల చూపును. "భక్తులను శోధనలో నుండి తప్పించుటకు ఆయన సమర్థుడు" అని పేతురు వక్కాణించాడు (2 పేతురు 2:9). "మమ్మును శోధనలోకి తేక దుష్టుని నుండి మమ్మును తప్పించుమని" ప్రార్థించుడియని యేసు తన శిష్యులకు నేర్పెను (మత్తయి 6:13). "దేవుని ప్రేమించు వారికి అనగా ఆయన సంకల్పము చొప్పున పిలువబడిన వారికి మేలు కలుగుటకై సమస్తమును సమకూడి జరుగుట" దేవుని కాపుదలయే (రోమా 8:28).

తన కాపుదలను బట్టి దేవుడు మన అవసరములను తీర్చును. "కాగా దేవుడు తన ఐశ్వర్యము చొప్పున క్రీస్తు యేసునందు మహిమలో మీప్రతి అవసరమును తీర్చును" (ఫిలిప్పీ 4:19). 2 కొరింథీ 9:10 ని కూడ చూడుము. దేవుడు తన కాపుదల చొప్పున తన ప్రజలను సంరక్షించును. "యెహోవా దృష్టి నీతిమంతుల మీద నున్నది. ఆయన చెవులు వారిమొరలకు ఒగ్గియున్నవి....... నీతిమంతులు మొర్రపెట్టగా యెహోవా ఆలకించును. వారిశ్రమలన్నిటిలోనుండి వారిని విడిపించును" (కీర్తన 34:15-17). దేవుడు తన కృపచొప్పున జనాంగములను పాలించును. ఆయన జనములను విస్తరింప జేయును, నిర్మూలము చేయును సరిహద్దులను విశాల

పరచును జనములను కొని పోవును" (యోబు 12:23). కీర్తన 22:28; దానియేలు 5:21; అపో.కా. 17:26ను కూడచూడుము.

ఒక్కోసారి సంగతులు సరిగా జరుగుచున్నట్లగుపడదు. సత్యము న్యాయము అణగద్రొక్కబడినట్లగు పడుచున్నప్పుడు కూడ దేవుడు తన కాపుదలను అమలు పరచుచున్నారు. మేఘములలో నుండి కూడ దేవుడు తన ప్రజలను కాయుచున్నారు. దేవుని మనం చూడక పోయినా, ఆయన ఎల్లప్పుడు పనిచేయుచునే యున్నారు. అన్నీ సక్రమముగా జరుగక పోయినను, దేవుడు అన్నిటిని తన కంట్రోలులో ఉంచుకొని యున్నారు. ఆయనను ప్రేమించువారికి మేలు కలుగుటకై సమస్తమును సమకూడి జరుగును.

– డేన్ ఫ్లవర్ నోయ్.

## విశ్వాసము యొక్క ఆవశ్యకత
## (The necessity of faith)

రక్షింపబడాలంటే విశ్వాసము అవుసరము. నమ్మనొల్లని వానికి శిక్ష విధింపబడును (మార్కు 16:15–10; అపో.కా. 16:30–31). నిత్య జీవము కొరకు విశ్వసించాలి; విశ్వసించకపోతే నశింతుము (యోహాను 3:16–18).

నిత్యజీవము కలిగి యుండుటకు విశ్వసించాలి, లేని యెడల దేవుని ఉగ్రత మన మీద నిలిచియుండును (యోహాను 3:36)

విశ్వసించకపోతే మన పాపముల లోనే యుండి చనిపోదుము (యోహాను 8:21–24). పాపక్షమాపణ నిమిత్తము విశ్వసించాలి (అపో.కా. 10:43). నీతిమంతులముగా తీర్చబడు టకు విశ్వసించాలి (రోమా 1:15–17; 5:1; గలతీ 2:16; 3:24–25).

దేవుని కుమారులగుటకు విశ్వాసము అవుసరము (గలతీ 3:26–27; 1 యోహాను 5:1).

విశ్వాసమే ప్రయోజనకరము (గలతీ 5:6).

విశ్వాసము లేకుండా దేవుని కిష్టులుగా యుండలేము (హెబ్రీ 11:6).

విశ్వాసము లేకపోతే నశిస్తాము (ప్రకటన 21:8).

వి. లక్ష్మణ్ గారికి జాషువాగారు ప్రత్యేక వందనములు తెలిపిరి. సిద్దిపేటలో బైబిలుక్లాసులు నిర్వహించుటకు తమ ఆలయమును ఉచితముగా నే అనుగ్రహించిన "యేసుక్రీస్తు కల్వరి" ఆలయ యాజమాన్యము వారికి మాకృతజ్ఞతలు. భవిష్యత్తులో తెలంగాణాలో క్రీస్తుసంఘము బలముగా నాటబడునట్లు చదువరులు ప్రార్థించమనవి.

2013 అక్టోబరు 10వ తేదీ రాత్రి మెదక్ జిల్లా పొలంపల్లిలో జరిగిన సువార్త కూటములో జాషువా గూటం సతీసమేతముగా హాజరై వాక్యపరిచర్యచేయగా ఇద్దరు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. పి.ఐ. సబ్బతిగారు, టి.డేవిడ్ రాజు గారు ప్రార్థనలలోను పరిచర్యలోను ఎంతగానో సహకరించిరి. సోదరులు సాల్మన్ గారు చేగుంటలో నివసిస్తు పొలంపల్లిలోను పరిసరప్రాంతములలోను సువార్త చాటు చున్నారు.

2013 అక్టోబరు 11వ తేదీ మద్యాహ్నం సికింద్రాబాద్ యాప్రాల్ లో ఎంప్లాయీస్ కోలనీ యున్న సోదరులు లెమూయేల్ ఆచారియా గారి గృహములో కృతజ్ఞత కూటము ఏర్పాటు చేయబడెను. సోదరులు యమ్. ఆశీర్వాదం గారు (ఆల్వాల్) అధ్యక్షతవహించగా సోదరులు జాషువా గూటం గారు 128వ దావీదు కీర్తన పై ఆధారపడి చక్కటి వాక్యపరిచర్యచేసిరి. లెమూయేల్ దంపతుల 10 యవ వివాహ వార్షికోత్సవసందర్భముగా ఆ కృతజ్ఞతా కూటము ఏర్పాటు చేయబడెను. అందరు లెమూయేలు దంపతులను అభినందించిరి, రామచంద్రపురం నుండి సోదరులు వై. సురేంద్ర కుమార్ గారు కూడ వచ్చి లెమూయేల్ దంపతులను అభినందించిరి. హాజరైన వారందరికీ లెమూయేలు గారి కుటుంబము మంచి విందు నేర్పాటు చేసిరి. దేవుడు ఈ దంపతులను మెండుగా దీవించునుగాక ! భవిషత్తులో సాధ్యమైనంత త్వరలో యాప్రాల్ లో క్రీస్తు సంఘము ఏర్పడునట్లు లెమూయేల్ దంపతులను దేవుడు వాడుకొనునట్లు ప్రార్థించమనవి.

## మీకొకగొప్పసదవకాశం

**సత్యవాణి** ద్వారా ప్రచురింపబడిన అత్యంత విలువైన పుస్తకములు 15 రకములు ఇప్పుడు లభ్యమగుచున్నవి. వాటి నికర మూల్యము 500/- రూ॥లు అగును. గాని మీరు 85/- రూ॥లు మాత్రమే మాకు M.O. పంపి వాటిని ఉచితముగా పొందవచ్చును. బైబిల్‌విద్యార్థులకు, బోధకులకు, తర్బీతుశాలలకు యిది గొప్ప సదవకాశం. ఈ రోజే మాకు వ్రాయండి. M.O.పంపించి పుస్తకములను పొందండి. మీ యింటిలో మినీ లైబ్రరీని స్థాపించండి.


**Satya Vani**

#7-9-35, Sambamurth Street,
Kakinada - 533 004. Ph: 0884 - 2363722



RNI Regd. No. 69973/98
Postal Regd. No. AP-VM/KD/02/2012-2014


To

From:
**SATYA VAKKU**
P.O. Box 80, Kakinada - 533 001


Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambhamurthy St. Kakinada - 533 004